# ప్రదర్శన

'ప్రదర్శన' మనిషి ఉనికినీ..... అతడి ప్రతిభనీ ఫోకస్ చేస్తుంది ! అతడెవరో, ఎందులో నిష్ణాతుడో తెలియజేస్తుంది.

ప్రదర్శనే లేకపోతే మనిషి శక్తి సామర్థ్యాలు ఎవరికీ తెలీకుండా మరుగునపడి పోతాయి! రాయికీ, రత్నానికీ తేడా తెలీకుండా పోతుంది ! రాయినెలా మలచుకోవచ్చో.... రత్నాన్ని ఎక్కడ భద్రపరుచుకోవచ్చో అర్థం కాకుండా పోతుంది.

అయితే...

ప్రదర్శన ఎంత అనివార్యమైనా....

'మా తాతలు నేతులు తాగారు... మా మూతుల వాసన చూడండీ' అన్నట్లుగా... మన తలిదండ్రుల ఆస్తిపాస్తుల్నో, వస్తువాహనాల్నో, పట్టువస్త్రాల్నో ప్రదర్శనకి పెట్టి నల్గురి దృష్టిని ఆకర్షించాలని ప్రయత్నించడం మన వ్యక్తిత్వానికి మచ్చ తెచ్చే అంశంగా భావించాలి!

ప్రతిపక్షం వాళ్ళు బ్రహ్మాండమైన ర్యాలీ నిర్వహించారని.... పాలక పక్షం దానికన్నా బ్రహ్మాండమైన ర్యాలీని నిర్వహించి.... తన బలమేమిటో ప్రదర్శించాలని ఉబలాట పడటం మనం గమనిస్తూ ఉంటాం ! ర్యాలీలలో, పోటీ ర్యాలీలలో జనం పలుచగా ఉంటే ఖంగుతినడం... ఇసుక వేస్తే రాలనంతగా ఉంటే పొంగిపోవడం మన పాలకులకూ, ప్రతిపక్షాలకూ అలవాటే !

అయితే....

కేవలం ర్యాలీలకు వచ్చిన జనాలను చూసి... ప్రజలు తమ విధానాలకు అనుకూలంగానో, ప్రతికూలంగానో స్పందిస్తున్నారనుకోవడం పొరపాటనీ.... ఏ పార్టీ సభకి ఎంత మంది జనం వచ్చారన్నది ముఖ్యంకాదనీ, అవినీతి పురుగుల లుక లుకల్లేకుండా... ఎంత 'శుచి'గా పాలించారన్నది మాత్రమే ప్రజలు గుర్తుంచుకుని... అవసరమొచ్చినపుడు తమ ఓటు వేటుతో ఆ ప్రభుత్వాన్ని పడగొడ్తారన్న విషయం.... మనం ప్రతిపక్షంలో ఉన్నా, పాలక పక్షంలో ఉన్నా గుర్తుంచుకుని తదనుగుణంగా ప్రవర్తిస్తే... ప్రదర్శనల పేరిట కొన్ని కోట్ల ప్రజాధనం దుర్వినియోగం కాదు !

పోతే...

ప్రదర్శన

నిగూఢంగా దాగి ఉన్న 'ప్రతిభ'ని వెలికితీసేదైతే.... మన ప్రోత్సాహాన్నివ్వాలి !

తోటివాళ్ళ 'లేమి'ని గుర్తుకు తెచ్చేదైతే... గర్హించాలి'

1-7-1995